క్లుప్తంగా

గ్రామాల్లో ప్రచారం



పొదలకూరు: మండలంలోని నేదురుమల్లి, బత్తులపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక మండల కమిటీ వారు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జి.పెంచలనర్సయ్య, సభ్యులు కృష్ణ, మధు, పెంచలయ్య, శేషాద్రి, వై.పెంచలయ్య, మాళవిక, నర్సారెడ్డి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం



పొదలకూరు: పట్టణంలో మళ్లీ పందులు తిరుగుతున్నాయి. మురుగు కాలువల్లో తిరుగుతూ అపరిశుభ్రతకు కారణమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

వెంకటాచలం: ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవాటవుతుందని క్యాంప్ కమాండెంట్ కల్నల్ డి.కరంచంద్ అన్నారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ పరిధిలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయలో ఆదివారం ఎన్‌సీసీ శిక్షణా శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఖోఖో, మ్యూజికల్ చైర్ తదితర పోటీలు పెట్టారు. యుద్ధ సమయంలో శత్రు సైన్యాన్ని ఎలా ఎదుర్కోవాలి?, శత్రువుల దాడి నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలనే విషయాలపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, క్యాంప్ అధికారి బాలబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ ప్రదర్శన



కోవూరు: సమ్మర్ క్యాంపును పురస్కరించుకొని పట్టణంలోని గ్రంథాలయంలో ప్రపంచ దేశాల కరెన్సీ ప్రదర్శనను ఏఎస్‌పేటకు చెందిన వాయిజ్ అహ్మద్ ఆదివారం ఏర్పాటు చేశారు. పిల్లలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. విశ్రాంత తహసీల్దార్ సురేంద్ర, ఉపాధ్యాయులు మునీంద్ర, రంగారెడ్డి, విశ్రాంత ఉద్యోగి సత్యనారాయణ, లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు విశేషాలంకరణ



మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ పంచామృభిషేకం చేశారు. ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు జరిగాయి. గ్రామస్తులు అధిక సంఖ్యలో సలిపిండి, పానకాలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టి వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యే పర్యటన

పొదలకూరు: మండలంలోని మరుపూరులో ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో గంగమ్మ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయన వెంట నేతలున్నారు.

• **తోటపల్లిగూడూరు:** వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద మండలంలోని వరిగొండలో రైతులకు వివిధ వస్తువులను ఎమ్మెల్యే సోమిరెడ్డి అందజేశారు. జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, ఏడీఏ రాజ్‌కుమార్, ఏఓ శిరీషారాణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉండలేక.. ఇబ్బంది పడుతూ..

- శిథిలావస్థకు చేరిన ఫైర్ స్టేషన్
- విశ్రాంతి గదుల్లేక సిబ్బంది అవస్థలు
- అర్ధాంతరంగా ఆగిన కొత్త భవన నిర్మాణం
- నాణ్యత లేకే దుస్థితిలో ప్రభుత్వ భవనాలు



ఫైర్ స్టేషన్ పాత భవనం

పొదలకూరు: పట్టణంలోని ఫైర్ స్టేషన్ భవనం దశాబ్దం నుంచి శిథిలావస్థలో ఉంది. స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో అధికారులు, సిబ్బంది దాతల సహకారం, తమ సొంత నిధులతో రిపేర్లు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా భవనాన్ని నిర్మించడం వల్లే దుస్థితికి చేరుకున్నట్టుగా తెలుస్తోంది. ప్రైవేట్ భవనాలు నిర్మిస్తే సుమారు ఐదు దశాబ్దాలపాటు మన్నికగా ఉంటున్న క్రమంలో ప్రభుత్వ భవనాలు మాత్రం రెండు దశాబ్దాలకే దెబ్బతినడం చూస్తే వాటి నిర్మాణాల నాణ్యత ఏపాటితో అర్థమవుతోంది.

సమస్యలెన్నో..

ఫైర్ స్టేషన్ ఫ్లోరింగ్ కూడా దెబ్బతినడంతో అగ్నిమాపక వాహనాన్ని చెట్ల కింద పెట్టాల్సి వస్తోంది. ఫైర్ అధికారి గది, సిబ్బంది విశ్రాంతి గదుల్లో స్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయోనని బిక్కుబిక్కుమంటున్నారు. ఐదేళ్ల క్రితం ఫైర్ స్టేషన్ భవనం పక్కనే మరొకదాని నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అప్పట్లో నూతన భవన నిర్మాణ పనుల నాణ్యతపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి.

ఎప్పటికి పూర్తయ్యేనో..

ఫైర్ స్టేషన్ నూతన భవనం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నాలుగు సుమారు రూ.40 లక్షల వరకు అంచనాలు వేసినట్టు సమాచారం. అయితే సంబంధిత కాంట్రాక్టర్ స్లాబ్ లెవల్ వరకు పనులు చేసి ఆపేశారు. చేసిన పనులకు బిల్లులు కూడా అయ్యాయి. ఈ నేపథ్యంలో పనుల్లో జాప్యం జరగడం వల్ల అంచనాలు తారుమారు కావడంతో కాంట్రాక్టర్ ప్రస్తుత ఎస్ఎస్ఆర్ (స్టేట్ షెడ్యూల్డ్ ఆఫ్ రేట్స్) ప్రకారం బిల్లులు చేయాలని పట్టుబట్టారు. పాత ఎస్ఎస్ఆర్ ప్రకారం పనులు చేస్తే తాను నష్టపోవాల్సి వస్తుందని చెప్పినట్టు తెలిసింది. దీంతో నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పట్లో పూర్తి కావని భావించిన సిబ్బంది తామే నడుం బిగించి పాత భవనానికి అడపాదడపా మరమ్మతులు చేయించుకుంటున్నారు. సిబ్బంది విశ్రాంతి గదులను గతంలో దాతల సహకారంతో నిర్మించారు. ఫైర్ అధికారి గదిలో స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో ఫైర్ ఆఫీసర్ తన సొంత నిధులను వెచ్చించి రెండు పర్యాయాలు రిపేర్లు చేయించుకున్నారు.

పని పెండింగ్‌లో ఉంది




భవనం పెచ్చులూడి పడుతుండటంతో చాలా ఇబ్బందిగా ఉంది. సిబ్బంది గదులకు సంబంధించి కూడా స్లాబ్ తరచూ ఊడి పడుతోంది. ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతినడంతో వాహనం లోన పెట్టుకునేందుకు వీలుపడటం లేదు. తాత్కాలిక రిపేర్ల ద్వారా నెట్టుకొస్తున్నాం. కొందరు దాతలు కూడా సహకారం అందిస్తున్నారు. నూతన భవన నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

– విజయవరకుమార్, ఫైర్ ఆఫీసర్, పొదలకూరు



ఆగిపోయిన భవన నిర్మాణం



సిబ్బంది విశ్రాంతి గదిలో ఇలా..

అంకమ్మతల్లికి పూజలు



విడవలూరు: విడవలూరు గ్రామదేవత అంకమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణలో పొంగళ్లను భక్తులు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు కొర్నా గిరి తదితరులు పాల్గొన్నారు.

బోర్డులు తొలగించిన వారిపై కేసు

పొదలకూరు: పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌లో పార్కు కోసం కేటాయించిన స్థలంలో పంచాయతీ వారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు, ఎన్టీఆర్ పార్కు పేరుతో పెట్టిన బోర్డులను తొలగించిన వారిపై ఆదివారం కేసు నమోదు చేశారు. పొదలకూరు సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి కథనం మేరకు వివరాలు.. పార్కు స్థలంలో ఉన్న బోర్డులను శివశంకర్, మరికొంతమంది కలిసి తొలగించారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు: మండలంలోని ఆదూరుపల్లి 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం పొదలకూరు, ప్రభగిరిపట్నం, వనంతోపు, విరువూరు, తాటిపర్తి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలను ఆదివారం నిర్వహించారు. తొలుత ఆశ్రమ ఆవరణలోని గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి, గంపల మంజుల, శేషయ్య, మేనేజర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. తొలిరోజున ఉదయం ఉత్సవ ప్రారంభం, సాయంత్రం అంకురార్పణ, 20న ఉదయం ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం శేష వాహనసేవ, సామూహిక లక్ష్మీనారాయణ పూజ, 21న ఉదయం సుదర్శన నారసింహ మేష్టి హోమం, సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం హనుమంత వాహనసేవ, 22న ఉదయం గజవాహనం, హంస వాహనం, సాయంత్రం గజవాహన సేవ, 23న ఉదయం కల్పవృక్ష వాహన సేవ, సాయంత్రం అశ్వవాహన సేవ, 24న ఉదయం రథోత్సవం, సాయంత్రం పుష్పయాగం, 25న ఉదయం స్వామికి 101 కలశాలతో అభిషేకం తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు.

ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు..



కోవూరు: వడదెబ్బ తగలకుండా వాహనచోదకులు తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ చిలకల శ్రీహరిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడారు. ఇనమడుగు రైల్వే గేట్ వద్ద వాహనచోదకుల సౌకర్యార్థం గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. పడుగుపాడు సర్పంచ్ చౌటూరు లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయ ముట్టడి జయప్రదానికి పిలుపు

కొడవలూరు: ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు బుధవారం చేపట్టనున్న డీఈఓ కార్యాలయ ముట్టడికి టీచర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిచ్చు డేవిడ్ చిన బాబు, ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఈఓ కార్యాలయానికి ఉదయం తొమ్మిది గంటలకు చేరుకోవాలని కోరారు.

చిత్రలేఖనంపై ముగిసిన తరగతులు

నెల్లూరు(బృందావనం): టెక్కేమిట్టలోని అమీర్ ఆర్ట్స్ అకాడమీలో 20 రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి అందజేశారు. అనంతరం కళారత్న అవార్డును అందుకున్న హాస్యనటుడు దోర్నాల హరిబాబును సత్కరించారు. కళాసంఘాల కన్వీనర్ భాస్కర్, డ్రాయింగ్ టీచర్ శ్రీనివాసులురెడ్డి, విశ్వం స్కూల్ కరస్పాండెంట్ బాలకృష్ణ, దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం అంతమొందాలని కాంక్షిస్తూ..



ఇందుకూరుపేట: దేశవ్యాప్తంగా ఉగ్రవాదం అంతమొందాలని కాంక్షిస్తూ మైపాడు సముద్ర తీరంలో పూజలను మౌనానంద తపోవనం సౌభాగ్య భువనేశ్వరి పీఠం, విశాఖపట్నం స్వామి రామానందభారతి ఆదివారం నిర్వహించారు. అనంతరం గంగపట్నంలోని చాముండేశ్వరిదేవిని దర్శించుకున్నారు. పూర్ణకుంభం, మేళతాళాలతో ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. భక్తులందరూ వచ్చి ఆలయాల్లో పూజలు చేస్తే దేశం సుఖంగా ఉంటుందన్నారు.

వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. పగలంతా ఎండ తీవ్రంగా కాసింది. అనంతరం వాతావరణంలో ఉన్నట్టుండి మార్పులు సంభవించి వర్షం పడింది. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వానతో కాస్త ఉపశమనం పొందారు. వరి పంట సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో కురిసిన వర్షంతో కొంతమేర మేలు జరుగుతుందని రైతులు తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా..



రోడ్లపై ఇసుక

పొదలకూరు: మండలంలోని విరువూరు రోడ్డు ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా సంగం బ్యారేజీ రోడ్డు, విరువూరు గ్రామానికి వెళ్లే రహదారిపై ఇసుక చేరడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సూరాయపాళెం ఇసుక రీచ్‌ల నుంచి లారీలు, ట్రాక్టర్లు ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారు. ఫలితంగా ఇసుక రోడ్లపై పడుతోంది. టిప్పర్లు, ట్రాక్టర్లు పట్టలు కప్పుకొని వెళ్లకపోవడం వల్ల ఇసుక పడుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో ద్విచక్ర వాహన చోదకులు జారిపడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. ఇసుక లారీలు, హెవీ టిప్పర్ల వల్ల రోడ్లు కూడా గుల్లవుతున్నాయి.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నాటి టీచర్లతో పూర్వ విద్యార్థులు

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 – 04 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ బ్యాచ్‌కు సంబంధించి వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారికి సహాయం చేస్తామేని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పద్మశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను పట్టణంలోని పాతకాశీపాళెం భావనా రుషీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ వెంకటసుధాకర్ మాట్లాడారు. విద్యతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని చెప్పారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకొని తమ భవిష్యత్తుకు బాటలేసుకోవాలని సూచించారు. చేవూరు చలమయ్య, దోనిపర్తి శ్రీహరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఆదివారం నివాళులర్పించారు. కమిషనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి కొలుపు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ తల్లి



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాపూరు: రాపూరు పంచాయతీ పరిధిలోని నవాబుపేటలో గంగమ్మతల్లి కొలుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి గంగపెట్టి ఊరేగింపు చేశారు. ఆదివారం అమ్మవారికి వివిధ పూజలు చేశారు. అమ్మవారి గంగపెట్టి ఊరేగింపు సమయంలో యువకులు, పెద్దల నృత్యాల నడుమ గ్రామంలోని పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తలపై పొంగళ్లు పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ బొల్లి ఆవులు, బొల్లి ఎద్దుల విగ్రహాలతో ఊరేగింపుగా గ్రామ పధాన వీధుల్లో సాయంత్రం అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా పూజారి గంగమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ తల్లి కొలుపు సందర్భంగా నవాబుపేట ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- నగరంలో ఎస్పీ తనిఖీలు
- పోలీస్ బీట్ డ్యూటీల పర్యవేక్షణ



నైట్ బీట్స్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. పోలీసుల తనిఖీలు ఫలితాలివ్వడం లేదు. వరుస హత్యలు, హత్యాయత్నాలతో నగర వాసులు భీతిల్లుతున్నారు. నేరస్తులు, అసాంఘిక శక్తులకు కొందరు రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో పోలీసులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా గడిచిన ఐదు నెలల్లో ఎనిమిది హత్యలు జరగడంతో శాంతి భద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. నేరాలను కట్టడి చేయాలని, నేరస్తులపై కఠినంగా వ్యవహరించా లని ఎస్పీ కృష్ణకాంత్ తరచూ ఆదేశిస్తున్నా.. కొందరు అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమయ్యారు. దీంతో పోలీసు బాస్ స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో నగరంలోని ఆర్టీసీ, ఏసీ కూరగాయల మార్కెట్, మద్రాస్ బస్టాండ్, వీఆర్సీ, గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్డు, నర్తకి సెంటర్, శెట్టిగుంటరోడు మినీబైపాస్, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి ఆయన పర్యటించారు. దుకాణాలను పలు చోట్ల తెరిచి ఉండటంతో వాటిని మూయించారు. వాహన తనిఖీలను నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో నైట్ బీట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. తాళాలేసిన ఇళ్లు, రైల్వేస్టేషన్, బస్టాండ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, నిర్మానుష్య ప్రదేశాల్లో గస్తీని పెంచాలని సూచించారు. బీట్ సిబ్బంది విజిల్ కార్డు, టార్చ్‌లైట్ వెంట ఉంచుకోవాలని, అనుకోని ఘటనలు జరిగిన సమయంలో సమాచారాన్ని ఉన్నతాధికారులకు, నైట్ రౌండ్స్ అధికారికి తెలియజేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర పోలీస్ అధికారులు ఎస్పీ ఆదేశాలతో తనిఖీలను విస్తృతం చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నగరంలోని రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులకు కౌన్సెలింగ్‌ను పోలీసులు ఆదివారం నిర్వహించారు. ఏఎస్పీ సౌజన్య పర్యవేక్షణలో దీన్ని ఏర్పాటు చేశారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాలను మూయాలని ఆదేశిస్తున్న పోలీసులు